# అచలపతీ - లంకెబిందెలూ

**“అ**చలపతీ, ఓ అద్భుతమైన కొటేషన్ విన్నానోయ్. ‘ప్రేమా,జూదం ఒక లాంటివే. అందువల్ల జూదరే ప్రేమలో విజయం సాధిస్తాడు’ అని. నువ్వూ వినే వుంటావేమో. ఎవరిదయ్యా ఆ కొటేషన్?”

“మీదేనండి. మూణ్ణెల్ల పది రోజుల క్రితం కూడా ఇలాగే అడిగారు”.

“రియల్లీ, ఇంత మంచి కొటేషన్.. ఆ భావం .. ఆ పదాల కూర్పు... నేనే చేసానంటావా? ఇంత చక్కని ఆలోచన మూణ్ణెల్ల క్రితమే వచ్చిందంటావా?”

“అప్పుడూ ఇలాగే ఆశ్చర్యపడ్డారు సర్, మూణ్ణెల్ల పది రోజుల క్రితమే ఇంత చక్కటి ...”

“... ఆగాగు, అంటే ప్రతీ మూణ్ణెల్ల పది రోజులకీ నేనీ కొటేషన్ కొట్టడం, ఆశ్చర్యపడడం... ఏదీ, ప్రతి నూరు రోజులకు మంత్రిగారు ప్రజాసేవకు పునరంకితం అయినట్టు... నో, నో ..నేన్నమ్మను. నా మతిమరుపును ఆసరా చేసుకుని ఇది నా మీద చేస్తున్న ఘోర ఆరోపణ అని... అచలపతీ, ఆ బల్ల ఇలా జరుపు”.

“సర్, మీరు బల్లగుద్ది ఏదైనా చెప్పదలచుకుంటే, ఆ బల్ల దానికి తగినది కాదని మనవి సర్. దానికి గ్లాస్‌టాప్ ఉంది. మీరు చెప్పదలచుకున్నది..”

“.....చెప్పడం కాదు, నేను ఉద్ఘాటించదలచుకున్నాను”.

“....పునరుద్ఘాటన అనడం సబబు సార్, మూణ్ణెల్ల పది రోజుల క్రితం ఈ కార్యక్రమం కూడా తమరు జరిపారు”.

"....అలా అయితే ఈసారి నొక్కి వక్కాణించేస్తాను. ఈ సోఫా చెయ్యి నొక్కితే చాలుగా".

"…. అది అవసరమని తాము భావించే పక్షంలో.."

"అవసరమేనోయ్, మా పాండు నాకు నిన్ననే కనబడి తన ప్రేమగాథ చెప్పాడు. వాడి తరహా చూసేకనే ప్రేమ, జూదం ఒకలాంటివేనని అనుకోవడం జరిగింది. అందుచేత.."

"సర్, పాండుగారు ప్రేమలో పడడం కూడా ప్రతీ నూరు రోజులకు ఒకసారి జరిగే ముచ్చటే కదా. ఆయన మీతో కాలేజీలో చదివే రోజులకు నుండీ ఏదో సాహసం చేసి పై కొచ్చేద్దామని చూడడం, మీ లాంటి ధనికులతో తిరిగి అడ్డదారినైనా ధనవంతుడు కావాలని ప్రయత్నించడం, డబ్బున్న అమ్మాయిని ప్రేమించడం కంటే మంచి అడ్డదారి లేదన్న ఆయన అంచనా ప్రకారం – శాయశక్తులా మనసు పారేసుకొని అది ఏ డబ్బున్న అమ్మాయికైనా దొరుకుతుందాని చూడడంలో మీ సహాయం తరచుగా ఆర్థించడం– ఇది రివాజుగా జరిగే వ్యవహారమే కాబట్టి, మీరు ప్రతీ వంద రోజులకు ఈ స్టేటుమెంటు ఇవ్వవలసి రావడం.."

అచలపతి ఇలా వాపోవడం తప్పు లేదు కానీ ఈ సారి పాండు దూకుడు చూస్తే వచ్చే వంద రోజులకు స్టేటుమెంటు ఇకపై ఇవ్వవలసిన అవసరం పడకపోవచ్చునిపిస్తోంది. వాడి హృదయంలో రైల్వే రిటైరింగు రూములా ఎప్పుడూ ఎవరో ఒకరు ఉంటూనే ఉంటారు గానీ ఈ సారి లత జీవితకాలం అధ్యక్షుళ్లా పాతుకుపోయినట్లుంది. అందుకే ఇప్పుడు ఒక పెద్ద మీమాంసలో పడ్డాడు.

లత మేనమామ భూపతిరాయుడు గారిదో వింతగాథ. ఆయన తండ్రి తిరుపతి రాయుడు గారిదో తిక్క వ్యహారం. ఆయునా, పొరుగూరి జమీందారు వెంకటరాయుడుగారు ఉబుసు పోకకు కబుర్లు చెప్పుకుంటూ తమ పిల్లల తెలివితేటల గురించి చర్చించారట. తన పిల్లల నిష్ప్రయోజకత్వాన్ని పక్కరాయుడుగారు ఎద్దేవా చేయడం చూసి, కినిసి, ఈ తిక్కరాయుడుగారు పందెం కాసేరట – 'నా ఆస్తంతా బంగారంగా మార్చి లంకె బిందెల్లో పెట్టి మా నూరెకరాల ఎస్టేట్లో ఎక్కడో అక్కడ దాచేస్తా. ఎక్కడ పెట్టానో ఎవ్వడికి చెప్పను. కానీ మా పిల్లవాళ్లు వారం తిరక్కుండా అదెక్కడుందో కనిపెట్టేస్తారు చూడు' అని!

కాసిన పందెం వివరాలు తెలియవు గానీ పుత్రరత్నాలు రత్నాల బిందెల అన్వేషణకై

ఒళ్లొంచడానికి సమయం వెచ్చించలేదట. తిరుపతి రాయుడుగారి తిక్క ఎక్కువై త్వరగా వెతక్కపోతే ఎస్టేటు కూడా అమ్మేస్తానని బెదిరించాడట. గుర్రప్పందాలు, వారకాంతలు వంటి ముఖ్యమైన వ్యవహారాలు పక్కనబెట్టి వాళ్లంతా రంగంలోకి దిగినా లంకెబిందెల జాడ తెలియలేదట. వారాలు, నెలలైనా నిధి కనిపెట్టలేని కొడుకుల అప్రయోజకత్వం తిక్కరాయుడిగారి మనసుని కలచివేసి, మంచం ఎక్కించిందట. బిందెల సంగతి చెప్పకుండానే బాల్చీ తన్నేస్తాడని భయపడి చావు దగ్గరపడ్డ సమయంలో ఆయన్ని వీళ్లు దీని గురించి కదిలించబోతే చికాకు పడ్డాడట. పందెం గోల ఆయనతో పోయిందని సంతోషిద్దురు గానీ అప్పులవాళ్ల బాధ తప్పాలంటే వెతికే తిప్పలు పడాల్సిందేమోననిపించింది కొడుకులకు.

ఇల్లూ, చుట్టూ వంద ఎకరాల స్థలమూ మిగిలాయిగానీ నిత్యఖర్చుకి చేత డబ్బులేదు. ఆ ఎస్టేటు చూపించే ఇన్నాళ్లూ అప్పులు పుట్టించారు. ఇకపైన అలా ఎంతకాలం సాగగలదో తెలీదు కాబట్టి మనసు పెట్టి, తమ ఎస్టేటులో ఉన్న ప్రతీ చెట్టూ, చేమా, చెరువూ, చెలమా, గోడా, గొయ్యీ– అన్నీ వెతికి చూసారు. కాసుల తల్లి కరుణించలేదు. కంటబడలేదు. ఆవిడ కంటబడగానే వెంట తీసుకు పోదామని కాచుకున్న అప్పులాళ్ల జనాభా పెరిగిపోవడంతో వ్యథ పెరిగి ఇద్దరు కొడుకులు జబ్బుపడి, చచ్చిపోవడంతో మిగిలిన ఏకైక వారసుడు భూపతి.

భూపతి అలవాట్ల దృష్ట్యా జూదరి కావడంతో అదృష్టం మీద గట్టి నమ్మకం ఉన్నవాడు. అదృష్ట దేవత ఇంట 'దేర్ ఉంది కాని అంధేర్' లేదనీ, ఓర్చుకుని 'కాచుకున్న వాడికే తేటనీర' నీ బాగా నమ్మడంతో తక్కినవాళ్లకంటే గుండె దిటవుతో నిలబడ్డాడు. తన వంతు ప్రయత్నాలు కొనసాగించాడు. మంత్రగాళ్ల దగ్గర్నుండి లేజర్‌బీమ్ వాళ్లదాకా అందరిచేతా వెతికించినా లంకెబిందెల ఉనికి తెలియ రాలేదు సరి కదా తన ఉనికికే ముప్పు వచ్చే పరిస్థితి ఏర్పడింది, అప్పులాళ్ల మూలంగా. మరి చక్రవడ్డీలా, తమాషానా!

ఆ ఎస్టేటుని అమ్మడమొకటే పరిష్కారం అన్న స్థితి వచ్చేసింది. కానీ అమ్మాలంటే 'వాపీ, కూప, తటాక, నిధి, నిక్షేపాలతో అమ్ముతున్నట్టు క్రయ దస్తావేజు రాయాలి. ఆ నిధి, నిక్షేపాలు రాయనంటాడీయన. రాయనని గట్టిగా చెబితే ఋణదాతలతో బాటు, తక్కిన వారికీ లంకె బిందెల విషయం తెలిసి రాత్రుళ్లు వెతికేసి తవ్వి పట్టుకుపోవచ్చు. అందువల్ల అమ్మడం కుదరలేదు.

ఈయన బాధ చూడలేక 'ఆ ఎస్టేటుని హాలిడే రిస్టారుగా మార్చి దాని మీద వచ్చే

అద్దెతో వడ్డీ అయినా కడితే అప్పులాళ్ల గోల తగ్గుతుంది కదా' అని సలహా ఇచ్చింది భూపతి మేనకోడలు లత, సదరు పాండు ప్రియురాలు. 'అయితే నువ్వే దాన్ని నిర్వహించి అప్పులు తీర్చేయి. నువ్వే నా వారసురాలివి. నిధి దొరికితే నువ్వే తీసుకో. నేను మాత్రం సన్యసించి వెళ్లిపోతున్నాను' అన్నాట్ట భూపతి మావయ్య.

కష్టపడి లతను ప్రేమించి, ప్రేమించబడినదాకా ఉండి ఆమె ఆర్థిక భవిష్యత్తు ఈ రిసార్టుపై ఆధారపడే స్థితికి రావడంతో పాండు బాధపడి పోయాడు. స్వర్గానికి వెళ్లినదాకా వుండి రంభ సన్యసించినట్టు తెలిసినట్లయింది. రంభకు మళ్లీ రక్తి కలుగుతుందా? లేదా? లత ఆ రిసార్టుని సమర్థవంతంగా నిర్వహించగలదా, లేదా? అన్న సంగతి మీద మన పాండు ప్రేమ ఆధారపడివుంది. పెళ్లాడేసినదాకా ఉండి ఆమె రిసార్టు 'నిర్వాహకత్వం', 'నిర్వాకం' అయితే శేషజీవితమంతా కాలు మీద కాలు వేసుకొని బతకడం అనే ప్రోగ్రామ్‌కి అంతరాయం కలగవచ్చు. స్వంతకాళ్ల మీద నిలబడి వాటికి శ్రమ కలిగించ రావలసివచ్చు. మరి...

"లతగారు రిసార్టు మేనేజ్ చేయగలరో లేదోనని పరిశీలించి చెప్పమని పాండుగారు మిమ్మల్ని కోరారా సర్?" అన్నాడు అచలపతి, ది థాట్ రీడర్.

అచలపతిలాటి వాడి ఎదుట మస్తకంలోని పుస్తకం తెరిచివుంచడం చాలా పొరపాటు. అందుబాటులో ఉన్న టోపి తల మీద పెట్టేసుకుని పుస్తకం అతని కంటబడకుండా దాచేశా.

"అవును. అందుకనే వాడిందాకా వచ్చి అడిగినప్పుడు 'ఆన్ ది స్పాట్ స్టడీ' చేయందే ఏమీ చెప్పలేనని చెప్పేశా. రేపే మన ప్రయాణం. పాండూ కూడా అక్కడికే చేరతాడు. మనం వాణ్ణి గుర్తు పట్టినట్టుండకూడదు. మనం రిసార్టులో సరదాగా కాలం గడపడానికి వచ్చినట్టనుకోవాలా అమ్మాయి".

భూపతి హోలిడే రిసార్టులో కంటి కింపుగా కనబడేది ప్రకృతి కాదు – బట్లర్ భద్రయ్య. పేరుకే బట్లర్ గానీ, ఆ రిసార్టు బాగోగులు చూసుకొనేదంతా అతనే! చెట్టంత మనిషి, మీసాల్లేకపోయినా ఉన్నాయనిపించే మొహం. పెద్ద, పెద్దవాళ్ల ఇళ్లలో పనిచేసి అలవర్చుకున్న గాంభీర్యం ఒకటి. ఎస్వీ రంగారావు కూలీ వేషం వేసినా 'ఒరే' అనలేనట్టుగా భద్రయ్యను ఎవరూ గౌరవహీనంగా చూడలేరు. ఆ విషయం అందరూ ఒప్పుకుంటారు. కానీ పాండు మరీ గౌరవంగా చూడటం లతకు నచ్చునట్టుగా ఉంది.

"ఈ లత వ్యవహారం నాకు నచ్చటం లేదురా" అంటూ వచ్చాడా రాత్రి పాండు, నేనూ అచలపతీ కీచురాళ్ల కాపేరెలా వచ్చిందాని చర్చిస్తున్న సమయంలో.

"హోస్టెస్‌గా లత వ్యవహారం నీకు నచ్చలేదంటే నేను నీతో ఏకీభవిస్తున్నాను. ఎందుకంటే నిన్న రాత్రి ఇచ్చిన ఇడ్లీలే నేటి ఉదయం కుడుములుగా కనబడడం, పైగా అదేదో 'ప్యూర్ ఆంధ్రా డెలికసీ' అని అట్టహాసం చేయడం నేను గర్హిస్తున్నాను. కానీ 'ఒక వ్యాపార దక్షురాలిగా లత వ్యవహారం' అనే అంశంలో నీకు నచ్చకపోతూ ఉంటే నేను నీతో విభేదిస్తున్నాను.."

"....అది కాదు.."

"...కానీ మా పొట్టగొట్టేది నీ బట్టల కోసమే అని గుర్తించుకో".

అచలపతి మా సంభాషణకు అడ్డం వచ్చాడు – "సర్, నేను మీ వాక్ప్రవాహానికి లాకు తలుపు లేసానని అనుకోకపోతే చిన్న మనవి. పాండుగారు లతగారి విషయంలో కళవెళపడుతున్నది తిండి విషయంలో కాదని నా కనిపిస్తోంది. సర్. లతగారు ఆయనపై విధిస్తున్న అంక్షలపై మాట్లాడడానికి వచ్చినట్టున్నారు".

"ఆంక్ష?! యూ మీన్ ఆంక్ష ? పాండూ, నోట్ చేసుకో. ఆంక్షలకు మూలం కాంక్ష. తనవాడనుకొన్న వాడి మీదే ఆంక్ష విధిస్తుంది అడది. లత నిన్ను గాఢంగా ప్రేమిస్తోందని ఇందు మూలంగా నిరూపణ.."

"కాస్త నా మాట వినరా బాబూ. అసలు గొడవ భద్రయ్య వల్ల వచ్చింది. నేను అతనితో సన్నిహితంగా ఉండడం లతకు నచ్చటం లేదు..."

"బట్లర్‌తో సన్నిహితంగా ఉండడం ఏమిట్రా? 'వారు మాత్రం మనుషులు కారా', 'కోసిన రక్తం రాదా' డైలాగులు కొట్టకు. 'బట్లర్‌లో నిన్ను ఆకర్షించిన అంశమేమి?' అది మాత్రం చెప్పు".

"చెప్పనా, మంచి కంపెనీ ఇస్తాడ్రా. నువ్వు ఎప్పుడు చూసినా నిద్రేనాయె. లత ఎదురుగా కలవ్వద్దని చెప్పావాయె. రిసార్ట్ మేనేజ్‌మెంటుతో లతకెప్పుడూ బిజీ. నాకేదైనా పని చెప్పమంటే నా సామర్థ్యం మీద నమ్మకం లేదంటుంది. మరి నాకు టైము పాస్ ఎలా? భద్రయ్యతో దోస్తీ కలిసాక భలే కాలక్షేపంలే. పులి జూదం ఆడడం నేర్పేడు.. చాలా ఈజీలే. అంతే కాదు, మేం ఇద్దరం చిన్న చిన్న పందాలు వేసుకుంటాం కూడా. 'నాలుగో కాటేజిలో ఉన్నాయనతో వచ్చినామె ఆయన భార్య అవునా? కాదా?' 'ఇవాళ చెట్నీలో ఉప్పెక్కువౌతుందా, తక్కువౌతుందా?' – ఇలాంటి

విషయాల్లో చిన్న చిన్న పందాలు వేస్తూ ఉంటాం. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. పందెం ఓడిపోతే కరక్టుగా డబ్బిచ్చేస్తాడు. అనవసరంగా పేచీలు పెట్టడు".

"...మరి గొడవేమిట్రా?"

"గొడవ అతనితో కాదురా, లతతో వచ్చి పడింది. 'భద్రయ్యతో పందాలేమిటి? మానేయండి' అంటుంది. తనకెలా తెలిసిందో మరి! మేం పులీ – మేకా ఆడడం చూసిందేమో ఒక వేళ. మా మధ్య ఎడబాటు పెరిగి పోతోందిరా. ప్రేమించను పొమ్మంటుందేమో".

"ఇక నాకు అర్థమయిపోయింది. లత ఓ జమీందారు కుటుంబం మనిషి. అరిస్టోక్రాట్. నీ సోషలిస్టు భావాలు తనకి నచ్చటం లేదన్నమాట. పనివాడు అనే పదార్థం 'అదుపులో ఉంచదగినది' అనే అర్థంలో తీసుకుంటుంది కాబోలు, నువ్వు సరిసమానంగా కూచుని పేకాడ్డం ఆమెకు రుచించడం లేదు...."

అచలపతి మెత్తగా దగ్గాడు. ఏదో చెప్దామని తాపత్రయమన్నమాట.

"యస్, అచలపతీ, నీ విశ్లేషణ కూడా విందాం. నా భావాన్ని కాస్త అందమైన భాషలో చెప్పగలద్రా, పాండూ! దాని వల్ల నీకు గుర్తుపెట్టుకోవడానికి ఈజీగా ఉంటుందన్నమాట. 'మేస్త్రీ ఆయె శాస్త్రి, వాస్తుకాయె శాస్తి', 'పనివాడిపై అదుపు, ప్రేమకు మదుపు' – అన్న టైపు సామెతొకటి ఫ్రేమ్ చేసి ఇచ్చేస్తాడు అచలపతి, గుర్తు పెట్టుకో, ఓవర్ టూ అచలపతీ.."

"మీరు మన్నిస్తే, మీ విశ్లేషణతో విభేదిస్తాను సర్..?"

"మన్నించకపోతే....?"

"మన్నించకపోవడంలో విజ్ఞతపై విభేదిస్తాను సర్".

"అయితే ఎలాగైనా విభేదం తప్పదన్న మాట. మన్నించాను. కానీయ్.."

"లతగారి చింత – పాండుగారూ పాడైపోవడం గురించి కాదని అనిపిస్తోంది సర్. ఆమె చింతంతా భద్రయ్య గురించి కావచ్చు. మీరు గమనించే ఉంటారు. అతను చాలా శ్రద్ధగా పనిచేస్తాడు. ప్రతీ గదినీ అతి జాగ్రత్తగా తుడుస్తాడు. మూల, మూలనున్న కన్నాలను కూడా శోధించి, మట్టి బయటకు లాగుతాడు".

"...నిజమే" అన్నాడు పాండూ, నేనూ డిటో.

"గోడలు కూడా ప్రతీ అంగుళం తడిమి, తడిమి తుడుస్తాడు. ఎక్కడైనా ఏ ఎలుకైనా దొలుస్తోందోనని ప్రతీ శబ్దం అతి జాగ్రత్తగా వింటాడు".

"నేనూ చూసానది, ముసిలాడు కదా చాదస్తమని అనుకున్నాను కూడా అయినా భద్రయ్య గుణగణాలకూ, లత పాండూ పై కోపం తెచ్చుకోవడానికీ లింకేముంది?"

"అక్కడకే వస్తున్నా సర్, అటువంటి అతి చక్కని పనివాడి గురించి యజమానులు జాగ్రత్తపడటంలో ఆశ్చర్యమేముంది, సర్. పాండుగారి స్నేహం వల్ల భద్రయ్య జూదరిగా మారి తన పనిలో నిర్లక్ష్యం చూపుతున్నాడేమో? దుస్సావాసం వదిలి పెట్టమని లతగారు అతనికి చెప్పే ఉంటారు. అతను వినకపోతే అట్నుంచి నరుక్కు వద్దామని.."

"ఇది ఘోర అవమానం అచలపతీ. బట్లర్ వల్ల నేనేమైనా లతకు ఫర్వాలేదు కానీ నా వల్ల బట్లర్‌కు ప్రమాదం రాకుండా కాపాడుతోందంటావా? అన్యాయమైన ఆరోపణ ఇది. ఇది నన్ను భద్రయ్య కంటే తక్కువ వెలుతుర్లో చూపిస్తోంది.., పూర్ లైట్ అన్నమాట".

"అవును, అచలపతీ, నేనూ పాండుతో ఏకీభవిస్తున్నాను. నా విశ్లేషణను నొక్కి వక్కాణిస్తున్నాను. మంచి పనివాడు దొరకడం కష్టమే కానీ మంచి ప్రియుడు దొరకటం ఇంకా కష్టం. పాండూ, నీ బాధ నా కర్థమయ్యింది. నువ్వు పనివాళ్లతో భుజం, భుజం రాసుకుని తిరిగే రకాని వనుకొని లత నిన్ను అసహ్యించుకుంటోంది. అయినా నీకిదేం పోయేకాలంరా, జూదం మీద వ్యామోహంతో నువ్విలా దిగజారిపోవడం ఏమీ బాగాలేదు. మానేయలేవూ?"

"మానేయడం ఎంత ప్రమాదకరమో తెలుసా? మా ఇంటి పక్కాయన అలాగే జూదం హఠాత్తుగా మానేసాడు! దెబ్బకి ఠారు మని చచ్చిపోయాడు!"

"నిజమా! అంటే అతని గుండె అంత తీవ్రంగా గాయపడిందా? మానేశాక ఎంత కాలం బతికేడు?"

"ఎంత? నెల్లాళ్లేమో, ఓ రోజు తుఫానుగాలిలో షెడ్డు రేకు ఎగిరొచ్చి ఛాతీలో గుచ్చుకుంది.."

".. ఏడిసినట్టుంది. ఒరే. ఓ సంగతి విను. నీ విషయంలో ఆమెనూ, ఆమె దురభిప్రాయాన్నీ వేరు చేయడానికొకటే ఉపాయం. తన ఎదురుగానే భద్రయ్యను ఏదో ఒక కారణం చెప్పి చాచి లెంపకాయ కొట్టేయి. దెబ్బకి 'అరిస్టోక్రాటిక్ పాండూ' అన్న వ్యాసానికి రెండు పేజీల సమాచారం రెడీ అయిపోతుంది".

"పాపం భద్రయ్య మంచివాడేరా. కొట్టేటంత పని చేయడు".

"ఒరే నీకు బొత్తిగా లౌక్యం తెలియదు. శివాజీ మిఠాయిబుట్టలో పలాయనం చిత్తగించిన విషయం ఔరంగజేబు దగ్గిర పడిపడి నవ్వుతూ చెప్పేరకం. భద్రయ్య మంచివాడని లత దగ్గిర అనేవు కనక. వట్టి పుండాకోరు అని చెప్పు. తన అంతస్తుకి మించిన స్నేహాలు చేయడానికి చూస్తున్నాడని అను. తెలిసిందా? మొహమాటాలు పెట్టుకోకు. వాలిడ్ రీజన్ కోసం చూడకు. 'పనివాళ్లను ఎక్కడుంచాలో అక్కడుంచుతున్నాను' అన్న మెసేజ్ లతకు ఇస్తున్నావన్నమాట. దట్సాల్. అచలపతీ, దగ్గద్దు. నో అయిడియాస్ ప్లీజ్. ఆ సారికిలా కానిచ్చేయ్..."

నిజానికి మన జ్ఞానం చాలా పరిమితమయినది. నా అంతటి వాడిని నేనే ఇలా అంటున్నానంటే, మామూలు మనుష్యుల సంగతి చెప్పేదేముంది? పాండు జ్ఞానం అపరిమితంగా పరిమితమైనది. అందుకనే పూర్వాపరాలు కనుక్కోకుండా నా సలహా కోరాడు. అంటే నా పూర్వాపరాలు కాదు, భద్రయ్య పూర్వాపరాలు కనుక్కోకుండా అతన్ని వదిలించుకోవాలని నా సహాయం కోరడం, మనకు ఆ ఘడియ దాకా అందిన సమాచారం ప్రకారం ఎలాంటి చర్య తీసుకోవాలో మనం చెప్పడం జరిగింది.

నా సలహాలో ఏ లోపమూ లేదని పాఠకులు గుర్తించాలి. ఫైల్సన్నీ పూర్తిగా ఇవ్వకుండా 'కమీషన్ రిపోర్టు ఇచ్చేయి' అంటే జడ్జీగారేం చేస్తాడు? తోచినదేదో రాసేస్తాడు. ఆ తర్వాత ప్రభుత్వాలు కూలదోసుకుంటే 'అయ్యోపాపం' అనుకుంటాడు. పాండు నాకు చెప్పినప్పుడు భద్రయ్య, భూపతి ఒకరే అన్న విషయం చెప్పాడా!? లేదు కదా! భూపతి ఫోటో రిసార్టులో ఎక్కడా లేదు, సరే, లత నడిగైనా సరే, "ఏదీ మీ మావయ్య ఫోటో నా కియ్యి, ఏదైనా మంచీ, చెడ్డా వచ్చినప్పుడు ఆయన ఎదురుగా నుంచొని డైలాగులు కొడతాను' అని అడగాలా? వద్దా? అదేమీ చేయలేదు. పోలికలు తెలియక బద్రయ్య ('బ'కు వత్తులేదు) గా భావించి, పట్టుకుని సాచి లెంపకాయ కొట్టేసాడు. అతను కళ్ల నీళ్లు పెట్టుకుని వెళ్లిపోయాడు కానీ ఆ దృశ్యం లత కంటబడింది. కోపం పట్టలేక, " ఈ మొత్తం ఎస్టేటుకి యజమాని ఆయన. ఆయన ఆస్టిరిక్స్ కామిక్స్‌లో కనబడే సీజర్ననుకున్నావా, నిజం సీజర్ తెలుసా", అని పాండుని తిట్టిపోసింది.

పాండు నవ్వేడుట, రెండో అర్జునుడు, మూడో కృష్ణుడు వేర్వేరు నటులని నమ్మించ జూస్తున్న డ్రామా కంట్రాక్టరుని చూసి నవ్విన ప్రేక్షకుల్లా... లత



విశదీకరించింది –

"అవును మా మావయ్యే. రిసార్టు మానేజిమెంటు నాకిచ్చి, లంకెబిందెలు వేటాడేందుకు వీలుగా, అప్పులాళ్లు గుర్తు పట్టలేనట్టుగా తను ఈ ఎస్టేటులోనే

మారువేషంలో పనివాడుగా ఉంటూ నిధులు వెతుకుతున్నాడు. అంత డబ్బుండి కూడా, నీకు టిఫెన్, కాఫీ తెచ్చిపెట్టే బట్లర్‌గా పనిచేశాడు. అంతటివాడిని ఉచ్చం, నీచం లేకుండా కొడతావా? నీకు బుద్ధుందా?" అని ఝాడించేసిందట లత.

సాయంత్రం వచ్చి, "మావయ్య మారువేషం తీసేయనన్నాడు. బిందెలు ఇంకా వెతకాల్సిన పని వుందట. నువ్వంటే కోపంగా ఉన్నాడు. ఏదో కారణం చెప్పి, నిన్ను బయటకు పంపించేయమన్నాడు. నీతో పెళ్లంటే మండిపడతాడని నేను మన ప్రేమ గురించి చెప్పలేదు. తన సంగతి నీకు చెప్పొద్దన్నాడు. నువ్వు మర్చిపోయి 'భూపతిగారూ' అనకేం, ఎప్పటిలాగానే భద్రయ్యా అను. గుర్తు పెట్టుకో. ఇంకెంతలే, రెండు రోజులేగా. ఆ తర్వాత ఎలాగూ వెళ్లిపోవాల్సి ఉంది" అందిట.

వీడేం చేస్తాడు. నా దగ్గరికి పరిగెత్తుకు వచ్చాడు. "పోనీలేరా, నాకూ ఇక్కడ బోరు కొడుతోంది. మనం బిచాణా ఎత్తేద్దాం" అన్నాను.

'లత కాపోతే మరో లలిత, కవిత, తవిక.. దిగులొద్దురా, లోకం గొడ్డు పోలేదు. అంతగా కాకపోతే బ్రహ్మచారిగా సైనయిపో. రాజకీయ సలహాదారుగా పైకొస్తావు...."

"లేదురా, లతను, నన్నూ ఒక ఇంటి వాళ్లను, అదే లేరా, ఒక రిసార్టు వాళ్లను చేయరా. నీ బోడి సలహా విని వ్యవహారం చెడగొట్టుకున్న వాడి మీద నీకు ఆవగింజంతైనా సింపతీ లేదేమిట్రా.. అచలపతీ, నువ్వే ఏదో మార్గం చూడు..."

"ఒరేయ్, అనవసరంగా అతని బుర్ర చెడగొట్టకు. అసలే వర్రీస్‌లో ఉన్నాడు. అతని ఫ్రెండ్స్ కొంత మంది సింగపూర్ వెళుతున్నారుట. కొంతకాలం పాటు అక్కడే వుంటారట. ఇతన్ని రమ్మన్నారు కానీ డబ్బు చాలటం లేదు. నేను అప్పిస్తానంటే వద్దంటాడు. దాచుకున్న డబ్బులు సరిపోవు. ఏం చేయాలో తోచక బుర్ర పట్టుకుని కూచున్నాడు. అందుచేత నీ ఘోష కనడు, వినడు, మూర్కొనడు".

"కంటాడు, వింటాడు, మూర్కొంటాడు కూడా, సరైన విధానంగా అడుగుతే! ఏమోయ్, చలపతీ, ఐయామ్ సారీ, అచలపతీ... మా భూపతిగారికి లంకెబిందెలు కనబడే మార్గం చెప్పవయ్యా, నీకు వాటా ఇస్తాడు. దాంతో సింగపూర్, పులిపూర్ అన్నీ తిరిగి తీరిగ్గా వద్దువుగాని".

అచలపతి చలించినట్టున్నాడు. "లంకెబిందెల సంగతి ప్రయత్నిద్దాం సర్. ముందుగా భూపతి తండ్రి తిరపతిరాయుడుగారు మరణశయ్య మీద ఉండగా ఏమన్నారో తెలుసా?" అడిగాడు.

"ఆఁ తెలుసు, లక్ష సార్లు విన్నాను. కొడుకులు లంకెబిందెల సంగతి ఎత్తబోయే సరికి ఆయనకు కోపం వచ్చి 'లంకె బిందెలు లేవు, డొంక బిందెలు లేవు. పోయి వెతుక్కోండి. తీసుకోండి' అని ఖస్సుమన్నాడు".

అచలపతి నాకేసి తిరిగి, "సర్, మీరా దశలో ఉంటే ఏమంటారు సర్" అని అడిగాడు.

"నేనా! ముందుగా మరణశయ్య ఎక్కనని మొండికేస్తాను. తులసి తీర్థం పోసే వాణ్ని తులసి ఆకులు సరిగ్గా కడిగారా అని అడుగుతాను.."

"అవి సరే సర్, మీ పిల్లలు లంకెబిందెలు ఎక్కడున్నాయి అని అడిగితే.."

"పిల్లలా, గిల్లలా, బ్రహ్మచారి బతుకుగాడిని.."

"సర్, మీ ఊహకు పదునుబట్టి చెప్పవలసిన అవసరం వచ్చింది. పిల్లలుండి, మీరు పందెం కాసి వుంటే, వారి తెలివితక్కువతనం మిమ్మల్ని నిరాశపరుస్తూ ఉండి ఉంటే...?"

"లంకెబిందెలూ లేవు, గింకెబిందులూ లేవు. పొండెహే అని చీదరించుకునేవాణ్ని."

"పాండుగారూ విన్నారా? 'లంకెబిందులూ లేవు, గింకెబిందులూ లేవు' అనేవారు ఎవరైనా సరే. కానీ తిరుపతిరాయుడుగారు అలా అనలేదు. 'లంకెబిందెలూ డొంక బిందెలూ' అన్నారు. అంటే వారి మాటల్లో పిల్లలకు ఏదో హింట్ ఇచ్చివున్నారు. వారు అదైనా గ్రహించి లంకెబిందెలు కనిపెట్టి, తన పరువు కాపాడుతారని ఆశించి వుండవచ్చు. ఆయన హింట్ ఇచ్చినట్లు తెలీకుండా ఇచ్చి వుండవచ్చు. ఎందుకంటే ఓపెన్‌గా చెప్పేస్తే, ఆయన మాట తప్పినట్లవుతుంది కాబట్టి. హింట్ మీకు అర్థమయిందిగా సర్?"

"సత్యజిత్‌రాయ్ సినిమా అర్థం కాలేదు రా మొగడా, అంటే రిత్విక్ ఘటక్ సినిమా చూడొచ్చుగా అన్నాట్ట వెనకటికెవడో. భూపతినాన్నగారి మాటైనా అర్థమయింది కానీ నీ విశ్లేషణ మాత్రం పీచుతీయని నారికేళంలో పాకంలా ఉంది".

"సర్, ఇలాటి పరిస్థితిలోనే 'ఎలిమెంటరీ, మైడియర్ వాట్సన్' అని ఉండేవాడు షెర్లాక్ హోమ్స్. ఈ ఎస్టేటులో డొంకలేమైనా ఉన్నాయా పాండు గారూ?"

"ఉన్నాయిగా, ఆ ఈశాన్యం మూలంతా డొంకలేగా".

"అక్కడ వెతికితే, లంకెబిందెలుంటాయని భద్రయ్యతో పందెం కాయండి సర్. పందెం నెగ్గుతారు ఆయన సంతోషించి లత గారినిచ్చి పెళ్లి చేస్తారు?"

"ఇంత గొడవయ్యేక భద్రయ్య మన దగ్గరకు వస్తాడంటావా?"

"వస్తాడు సర్, జూదంలో ఉన్న మజా అలాటిది, సాటి జూదరిపై మక్కువ అలాటిది. ముందురోజు కట్టుబట్టలు దోచుకున్నవాడితో కూడా మరునాడు ఆటకు సిద్ధమవుతారు..."

మన పాండు అతి చురుకైనవాడు. భద్రయ్య ఆ రాత్రి వచ్చినప్పుడు, ఏదో ప్రస్తావన తెచ్చి, డొంకల్లో నిధి దొరుకుతుందని పందెం కాయడం జరిగింది. 'దొరికితే సగం నీది, సగం నాది' అన్నాట్ట భద్రయ్య. రాత్రికి రాత్రి వెళ్లి తవ్వేసారు మొత్తమంతా. ఇంతకు ముందు పాముల పుట్టలా ఉన్నదాని జోలికి పోలేదుట. దానిలో పాములు తిరగ్గా ఎన్నడూ చూడలేదని గుర్తుకొచ్చింది భద్రయ్య కిప్పుడు. అది కృత్రిమంగా కట్టినదట. దాని కిందే దొరికాయి లంకెబిందెలు.

ఇంకేముంది, కథ అతి త్వరగా కంచి కెళ్లిపోయింది. భద్రయ్య హఠాత్తుగా భూపతి అయిపోవడం, లతకు కన్యాదాతయిపోవడం, దొరికిన దాంట్లో సగం, లతతో సహా పాండుకి ఇవ్వడం చకచకా జరిగిపోయాయి.

కథ ఒకటే కంచి కెళితే బాగుణ్ను. వెంట అచలపతినీ సింగపూర్ తీసుకెళ్లి పోయింది. ఈ కథకు కర్త పాండు. అచలపతి చేసిన ఉపకారానికి అతనికి బోల్డంత డబ్బు బహుమతిగా ఇచ్చేడు.

అచలపతి వెంటనే సింగపూర్ ప్రయాణం ఖరారు చేసుకున్నాడు. ఏమంటాను? సరేననక!

